ఇసుక క్వారీలో ఇష్టారాజ్యం..



2



2

కామన్ స్కూల్ విధానం అమలుచేయాలి

AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

## పుప్పాల శ్రీశైలంకు డీఎస్పీగా పదోన్నతి



**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలో ఎస్బీ సీఐగా విధులు నిర్వహిస్తున్న పుప్పాల శ్రీశైలం కు పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆయనను డీఎస్పీగా ప్రమోట్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.. జగిత్యాల జిల్లా లో జన్మించిన పుప్పాల శ్రీశైలం 1998 బ్యాచ్‌కు చెందిన పోలీస్ అధికారి. 25 ఏళ్లుగా ఆయన శాఖలో వివిధ హోదాల్లో పనిచేశారు. కొన్నేళ్లుగా ఎస్బీలో సీఐగా పనిచేస్తున్నారు. విధుల్లో నిక్కచ్చిగా వ్యవహరిస్తారనే పేరున్న ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం డీఎస్పీగా ప్రమోట్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. త్వరలోనే శ్రీశైలంకు పోస్టింగ్ ఇవ్వనున్నారు.



## ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలి



**అక్షరటుడే, లింగంపేట :** ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని శ్రద్ధతో చదువుకుంటే ఏదైనా సాధించవచ్చనని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో గురువారం విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులతో ఏర్పాటుచేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందజేస్తున్నట్లు వివరించారు. ప్రతి విద్యార్థి శ్రద్ధతో చదవాలన్నారు. పాఠశాలలో కంప్యూటర్లు లేవని కలెక్టర్‌కు వివరించగా.. వెంటనే ఆయన స్పందించారు. పాఠశాలకు కంప్యూటర్లు అందజేస్తామన్నారు. విద్యార్థుల నడవడికను చూసి కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో ప్రభాకర్, ఎమ్మార్వో సురేష్, ఎంపీడీవో నరేష్, ఎంపీవో మళహరి, పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షం: మానాల మోహన్ రెడ్డి



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ పేదల పక్షమేనని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి అన్నారు. మండలంలోని కోన సముందర్, నర్సాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా మానాల మోహన్ రెడ్డిని నర్సాపూర్ గ్రామ పంచాయతీలో సర్పంచ్ లతా శేఖర్, ఉపసర్పంచ్ రాజకుమార్, పాలకవర్గం ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మానాల మాట్లాడుతూ.. పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నామన్నారు. ఎన్నికల హామీలో భాగంగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నారన్నారు. రాష్ట్రంలోని 119 నియోజవర్గాల్లో 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయన్నారు. లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకుంటున్నారని వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ పాలెపు నర్సన్న, మండల ప్రెసిడెంట్ సుంకెట రవి, గణేష్, సంజీవ్, లింబాద్రి, రమేష్‌గౌడ్ తదతరులు పాల్గొన్నారు.

# కో ఆప్షన్ దక్కేదెవరికో!



- కామారెడ్డిలో 35 దరఖాస్తులు
- కాంగ్రెస్ పార్టీలో పోటీ అధికం
- బరిలో బీజేపీ నుంచి ఐదుగురు, బీఆర్ఎస్ నుంచి ముగ్గురు

కామారెడ్డిలో కో ఆప్షన్ పదవుల కోసం పోటీ తీవ్రంగా ఉంది. నాలుగు పదవుల కోసం ఏకంగా 35 మంది దరఖాస్తు చేసుకున్నారు. మూడు ప్రధాన పార్టీల నుంచి అభ్యర్థులు బరిలో నిలవగా.. అధికార పార్టీలో పోటీ ఎక్కువగా ఉంది. దీంతో ఆ పదవులు ఎవరికి దక్కుతాయోననే ఉత్కంఠ నెలకొంది. మైనారిటీ కోటాలో రెండు, జనరల్ విభాగంలో రెండు చొప్పున కో ఆప్షన్ సభ్యుల పదవులను భర్తీ చేయనున్నారు.

- అక్షరటుడే, కామారెడ్డి

మున్సిపాలిటీల్లో కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక సందడి మొదలైంది. ఉమ్మడి జిల్లాలో ఏడు మున్సిపాలిటీలు ఉండగా.. రెండు చోట్ల కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక కోసం దరఖాస్తులు స్వీకరించారు. కామారెడ్డిలో దరఖాస్తుల ప్రక్రియ పూర్తి కాగా ఎల్లారెడ్డిలో ఈ నెల 28 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అయితే కో- ఆప్షన్ పదవికి ఆయా పార్టీల క్యాడర్ పోటాపోటీగా దరఖాస్తులు చేసుకుంటున్నారు.

### కాంగ్రెస్ నుంచి 27 మంది..

కామారెడ్డి మున్సిపాలిటీలో కో-ఆప్షన్ పదవికి పోటీ తీవ్రంగా ఉంది. నాలుగు పదవులకు ఏకంగా 35 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి 27 మంది ఉండగా బీజేపీ నుంచి ఐదుగురు, బీఆర్ఎస్ నుంచి ముగ్గురు దరఖాస్తు చేశారు. దాంతో కో - ఆప్షన్ పదవి ఎవరికి వరిస్తుందోనన్న ఉత్కంఠ కొనసాగుతోంది. కాంగ్రెస్‌లో ఏడుగురు జనరల్ కేటగిరి, 20 మంది మైనార్టీ కేటగిరి నుంచి దరఖాస్తు చేసుకోవడం గమనార్హం.

### బీజేపీ, బీఆర్ఎస్ నుంచి..

మున్సిపాలిటీలో ప్రధాన ప్రతిపక్షంగా నిలిచిన బీజేపీ నుంచి ఐదుగురు కో-ఆప్షన్ పదవికి దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ముగ్గురు జనరల్ కేటగిరి, ఇద్దరు మైనార్టీ కేటగిరి నుంచి ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి ముగ్గురు దరఖాస్తు చేసుకోగా.. ఇందులో ఇద్దరు మైనార్టీ, ఒకరు జనరల్ కేటగిరి నుంచి ఉన్నారు. అయితే మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నిక సమయంలో కాంగ్రెస్ పార్టీకి బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఆ పార్టీకి ఒక కో ఆప్షన్ పదవి ఇచ్చేందుకు గతంలో ఒప్పందం జరిగినట్లు సమాచారం. పదవి ఆశిస్తున్న వారిలో పలువురు మాజీ కౌన్సిలర్లు సైతం ఉన్నారు.

### ఎల్లారెడ్డిలో 28 వరకు..

ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే కో-ఆప్షన్ పదవికి ఆరుగురు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 28 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉండడంతో ఆశావహుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయి. త్వరలోనే కామారెడ్డి, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలలో కో -ఆప్షన్ సభ్యుల ఎన్నిక పూర్తి చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం

**అక్షరటుడే,బోధన్:** పట్టణ శివారులోని మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల సిబ్బంది సన్మానించారు. పాఠశాలలో గురువారం నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్‌లో భాగంగా పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాబోయే విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్ల విషయమై తల్లిదండ్రులతో చర్చించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పద్మజతో పాటు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.




## బాధ్యతలు స్వీకరించిన అదనపు డీసీపీ శుభం ప్రకాశ్



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ లో అదనపు డీసీపీ (అడ్మిన్)గా శుభం ప్రకాశ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన సీపీ కార్యాలయంలో పోలీస్‌కమిషనర్ సాయిచైతన్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడ పనిచేసిన అదనపు డీసీపీ (అడ్మిన్) బస్వారెడ్డి చీఫ్ ఆఫీస్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో నియమితులైన శుభం ప్రకాశ్ గురువారం ఛార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ అదనపు డీసీపీకి శుభాకాంక్షలు తెలిపారు.



## ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీజేపీ మద్దతు

**అక్షరటుడే, ఆర్మూర్:** తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మె గురువారం రెండోరోజుకు చేరింది. ఆర్మూర్ ఆర్టీసీ కార్మికుల సమ్మె శిబిరాన్ని జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ పార్టీ తరపున సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయమైన ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు బీజేపీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రెసిడెంట్ మందుల బాలు, నూతుల గంగారెడ్డి, సుంకరి రంగన్న, యుగంధర్, ఉదయ్ గౌడ్, కలిగొట ప్రశాంత్, ధోండి ప్రకాష్, ఆర్టీసీ జేఏసీ నాయకులు డీవీఎస్ చక్రవర్తి, యూత్ అశోక్, చిలుక రవి కార్మికులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు తీర్పు హర్షణీయం: బిగాల



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు తీర్పు హర్షణీయమని మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల గణేష్ గుప్తా అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని తెలంగాణ హైకోర్టు ఆదేశించడంతో న్యాయం గెలిచిందని ఆయన పేర్కొన్నారు. కమిషన్ విచారణలో ప్రాథమిక నిబంధనలు పాటించలేదని కోర్టు స్పష్టం చేయడం ద్వారా ఆ నివేదికకు చట్టపరమైన ప్రాముఖ్యత లేదని తేలిందన్నారు. ముఖ్యంగా సెక్షన్-8 కింద సంబంధిత వ్యక్తులకు నోటీసులు ఇవ్వకుండా ఆరోపణలు చేయడం సరికాదని కోర్టు వ్యాఖ్యానించడం అత్యంత కీలకమన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు పై రాజకీయంగా ఒత్తిడి తేవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కమిషన్‌లను అడ్డంపెట్టుకుని వేధింపులకు పాల్పడిందని విమర్శించారు. న్యాయస్థానాలపై బీఆర్ఎస్‌కు నమ్మకముందని.. ఆ నమ్మకమే నిజమైందని బిగాల అన్నారు. తెలంగాణ జీవధారగా భావించే కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ పార్టీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టను దెబ్బ తీయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కక్షపూరితంగా వ్యవహరించాయని విమర్శించారు. ప్రాజెక్టు మరమ్మతులను సకాలంలో చేపట్టకుండా దాదాపు రెండున్నరేళ్లు ఆలస్యం చేశారని, చివరకు గత్యంతరం లేక ఇప్పుడు పనులు చేపడుతున్నారన్నారు. కాళేశ్వరం విషయంలో కేసీఆర్‌పై చేసిన ఆరోపణలు నిరాధారమని ఈ తీర్పుతో స్పష్టమైందని, కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఈ తీర్పుతోనైనా కనువిప్పు కలగాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ వేధింపులను పక్కన పెట్టి పాలనపై దృష్టి సారించి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని గణేష్ బిగాల సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, మాజీ మేయర్ దండు నీతుకిరణ్ శేఖర్, పార్టీ నగర అధ్యక్షుడు సిర్ప రాజు, నుడా మాజీ ఛైర్మెన్ ప్రభాకర్ రెడ్డి, సుజిత్ సింగ్, నవీద్ ఇక్బాల్, గాండ్ల లింగం, మతిన్ తదితరులు పాల్గొన్నారు.

## వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. సెలవులను ఉల్లాసంగా గడుపుతూ.. ఇష్టమైన రంగంలో ప్రతిభను మరింతగా మెరుగుపర్చుకునేలా కృషి చేయాలని హితవు పలికారు. డిచ్‌పల్లి మండలం సుద్దపల్లిలో సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో గురువారం నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి నుంచి వేసవి సెలవులు ప్రారంభమవుతాయని.. సెలవుల్లో ఏం చేస్తారని విద్యార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. స్విమ్మింగ్, కరాటే, డ్యాన్స్, సంగీతం వంటి వాటిలో తమ అభిరుచికి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. వీలైతే చారిత్రక ప్రదేశాలను సందర్శించాలన్నారు. సెలవులను వృథా చేసుకోవద్దని, స్మార్ట్‌ఫోన్లకు అలవాటు పడి భవిష్యత్తును పాడు చేసుకోవద్దని కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు. ఈ విషయంలో తల్లిదండ్రులు కూడా పిల్లలను జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలని, వారంలో అరగంటకు మించి పిల్లలు స్మార్ట్‌ఫోన్ వినియోగించకుండా చూడాలని సూచించారు. బాలికలపై వివక్ష చూపకుండా వారిని



ఉన్నత విద్య అభ్యసించేలా ప్రోత్సహించాలని సూచించారు. రెసిడెన్షియల్ స్కూల్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ విద్యార్థినులకు కలెక్టర్ బహుమతులు ప్రదానం చేశారు. సమావేశంలో పాఠశాల ప్రిన్సిపాల్ నళిని, తహశీల్దార్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ర్యాగింగ్ తీవ్రమైన నేరం : సీపీ సాయిచైతన్య

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ర్యాగింగ్ తీవ్రమైన నేరమని.. దానికి కఠినమైన శిక్షలు ఉంటాయని సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. యాంటీ ర్యాగింగ్, మత్తు పదార్థాల నివారణ, సైబర్ క్రైంపై నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీపీ సాయి చైతన్య ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులతో మాట్లాడారు. మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం అవుతాయని.. పొరపాటున కూడా వాటి జోలికి విద్యార్థులు వెళ్లవద్దని సీపీ సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, జీజీహెచ్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ నాగమోహన్ మాట్లాడుతూ కళాశాలలో ర్యాగింగ్‌కు జీరో టాలరెన్స్ విధానం అమలు చేస్తున్నామన్నారు. విద్యార్థుల భద్రతకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా



ర్యాగింగ్, డ్రగ్, సైబర్ క్రైంలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎన్‌సీసీ, ఈగిల్ సెల్ డీఎస్పీ సోమనాథం, సీసీపీఎస్ ఏసీపీ వెంకటేశ్వరరావు, ఏసీపీ ప్రకాశ్, అడ్వొకేట్ నారాయణ, వైద్యులు జలగం తిరుపతి రావు, కిషోర్, వన్ టౌన్ సీఐ రఘుపతి, కళాశాల సూపరింటెండెంట్ పెద్దోళ్ల నాగరాజు పాల్గొన్నారు.

# ఇసుక క్వారీల్లో ఇష్టారాజ్యం..

**కోటగిరి మండలంలో ఇసుక క్వారీల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆన్‌లైన్ యాప్‌లో ఇసుక కోసం నమోదు చేసుకున్న తర్వాత లోడింగ్ కోసం క్వారీకి వెళ్తే ఇష్టారాజ్యాంగా వసూలు చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. దీనిపై అధికారులు స్పందించాల్సి ఉన్న నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు పేర్కొంటున్నారు.** – అక్షరటుడే, కోటగిరి



■ కోటగిరి మండలంలో దర్జాగా తవ్వకాలు.. ■ పోతంగల్, హంగర్గా, కారేగాం క్వారీల్లో దోపిడీ ■ రైతులు, సామాన్యులకు ఇబ్బందులు

కోటగిరి మండలంలోని మూడు ఇసుక క్వారీల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకున్న తర్వాత క్వారీకి వెళ్తే రూ.2వేల నుంచి రూ.3వేల వరకు వసూలు చేస్తున్నారని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. ఇదే విషయమై టీఎండీసీ అధికారులు మాత్రం రూ.12,00 వరకు చెల్లిస్తే సరిపోతుందని చెబుతున్నప్పటికీ క్వారీ వద్ద మాత్రం పరిస్థితి వేరేలా ఉందని వారంటున్నారు.

**రాత్రిళ్లలో జోరుగా..**

**టిప్పర్లలో ఇసుకను ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6 వరకు తరలించాల్సి ఉండగా.. రాత్రి 9గంటల వరకు కూడా జోరుగా తరలిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులకు అన్నీ తెలిసినప్పటికీ నిర్లక్ష్యం వహిస్తున్నారని వారంటున్నారు.**

### మూడు ఇసుక క్వారీల్లో..

మండలంలోని పోతంగల్, హంగర్గా, కారేగాం క్వారీల్లో ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే క్వారీల్లో లోడింగ్ చేసే ప్రాంతంలో నిర్వాహకులు దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేబిల్లులు ఒకరోజుకు తీసుకుని లెక్కల్లో లేనివిధంగా టిప్పర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు బీజేపీ నాయకులు సైతం ఆరోపిస్తున్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని బీజేపీ నాయకులు గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా.. కొన్నిరోజుల వరకు టిప్పర్ల రాకపోకలు నిలిచిపోయాయని.. ప్రస్తుతం మళ్లీ యథాతథంగా నడుస్తున్నాయని ఆయా ప్రజలు పేర్కొంటున్నారు.

### తూకాలు అయ్యేవరకైనా..

మండలంలో ధాన్యం కాంటాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా కొన్ని చోట్ల కొనుగోలు కేంద్రాలు రోడ్ల పక్కనే కాంటాలు పెట్టి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. మరికొన్నిచోట్ల ధాన్యాన్ని రోడ్లపై ఆరోబోశారు. అయితే ఇసుక టిప్పర్లు రోడ్లపై ఆరోబోసిన ధాన్యం మీది నుంచే వెళ్తుండడంతో తమ ధాన్యం పూర్తిగా నూకలుగా మారిపోతోందని రైతులు వాపోతున్నారు. ధాన్యం విక్రయాలు పూర్తయ్యే వరకైనా టిప్పర్ల రాకపోకలను నిలవరించాలని వారు కోరుతున్నారు.

### ట్రాక్టర్లకు ఆన్‌లైన్ యాప్‌లో నో ఇసుక..

ఇందిరమ్మ ఇళ్ల కోసం టిప్పర్ల ద్వారా ఇసుకను కొలుగోలు చేయాలనుకునే వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో వారు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తీసుకెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతున్నారు. అలాగే క్వారీల వద్ద దోపిడీని నిలువరించాలని విన్నవిస్తున్నారు.

### డ్రైవర్లు పారిపోయారు..



ఇసుక క్వారీల వద్ద అక్రమాలు జరుగుతున్నాయని మేం ఇటీవల అక్కడికి వెళ్లాం. అయితే మమ్మల్ని చూసిన టిప్పర్ల డ్రైవర్లు అక్కడి నుంచి పారిపోయారు. వేబిల్లులు చూస్తే అడ్డదిడ్డంగా ఉన్నాయి. ఒక వేబిల్ పై ఇష్టారాజ్యంగా ఇసుకను తోలుతున్నారు. దీనిని నిలువరించాల్సి ఉంది. – **కోనేరు శశాంక్, ఎన్ఆర్ఐ**

### భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయి..



ఇసుక మొత్తం తవ్వేస్తుంటే, భూగర్భ జలాలు ఇంకిపోయి బోర్ల ద్వారా నీరు వచ్చే పరిస్థితులు తగ్గిపోయాయి. నీరు రాకుంటే మంజీర పరీవాహక ప్రాంతాల రైతులు పంటలు ఎలా పండించుకోవాలి. రైతన్నలు ఆరుగాలం పండించిన పంటను రోడ్లపై ఆరబెడితే టిప్పర్లు వాటిమీదుగా వెళ్తున్నాయి. దీంతో ధాన్యం దెబ్బతింటోంది. కాంటాలు అయ్యేవరకు ఇసుక రవాణాను అరికట్టాలి.
– **పబ్బ శేఖర్, బీజేపీ నాయకులు**

### ట్రాక్టర్ల ద్వారా ఇసుకకు అనుమతివ్వాలి



కారేగాం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ప్రజలకు నీరు సరఫరా అవుతుంది. ఇసుకను తోడేయడం ద్వారా మోటార్ల ద్వారా నీరు ఎలా వస్తుంది. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కావాలంటే ఇసుక దొరకడం లేదు. ఆన్‌లైన్ బుకింగ్ కావడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి మండలాల్లో ఇసుక లేక ఇందిరమ్మ ఇళ్లు నిలిచిపోయాయి. ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలింపునకు అనుమతి ఇవ్వాలి.
– **సోంపూర్ పోచీరాం, ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయక కార్యదర్శి**

## మల్లిఖార్జున ఖర్గే దిష్టిబొమ్మ దహనం



**అక్షరటుడే, మాక్లూర్:** ప్రధాని మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మాక్లూర్‌లో ప్రధాన రహదారిపై గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రధానిపై వ్యాఖ్యలు చేసిన ఖర్గే వెంటనే క్షమాపణ చెప్పాలని నినదిస్తూ ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రపంచ స్థాయిలో దేశాన్ని సుప్రీంగా నిలబెట్టేందుకు కృషిచేస్తున్న గొప్ప నాయకుడు మోదీ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, గంగారెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



**అక్షరటుడే, లింగంపేట:** ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని, అలాగే అనేక సదుపాయాలు కల్పిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రజనీకాంత్ అన్నారు. లింగంపేట మండలం ఒంటరిపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించవద్దని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు గ్రామస్థులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సౌజన్య కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాలి



**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్రంలో కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని టీపీటీఎఫ్ నిజామాబాద్ అధ్యక్షుడు వెనిగళ్ల సురేష్ అన్నారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన, ఉచిత, సమాన విద్య అందించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. వీటిపై చర్చించేందుకు తెలంగాణ ప్రోగ్రెస్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర విద్యా సదస్సును విజయవంతం చేయాలన్నారు. ఈ మేరకు నగరంలో కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన, ఉచిత, సమాన విద్య అందించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. విద్యా హక్కుల సాధన కోసం సమగ్ర ఉద్యమాన్ని నిర్మించడమే టీపీటీఎఫ్ లక్ష్యమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏప్రిల్ 30న ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. 'సమరశీలతత్వాన్ని చాటుకుందాం.. విద్యా సమానత్వం సాధిద్దాం" అనే నినాదంతో ఈ సదస్సు జరుగుతుందన్నారు. విద్యారంగ సమస్యలతో పాటు సామాజిక సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయులు నిరంతరం పోరాటాలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూదరి అర్వింద్, ప్రతినిధులు గోపి, సాయి, శ్రీహరి రావు, శ్రీలక్ష్మి, రామచంద్ర గైక్వాడ్, సునీత, రాములు, రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి సెపక్‌తక్రా పోటీలకు పోతంగల్ కలాన్ క్రీడాకారిణి

**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని పోతంగల్ కలాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని అబ్దుల్ అలియా సెపక్‌తక్రా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. మహబూబాబాద్ జిల్లాలో జరిగిన ఎస్జీఎఫ్ అండర్-14 రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని ఫిజికల్ డైరెక్టర్ నాగరాజు తెలిపారు. రాష్ట్రజట్టుకు కెప్టెన్‌గా అలియా ప్రాతినిధ్యం వహించనుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం రంగారావు విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు.



## ఐస్‌క్రీమ్ అమ్మకాలు నిషేధిస్తూ హంగర్గాలో తీర్మానం




**అక్షరటుడే, కోటగిరి:** ఐస్‌క్రీమ్ అమ్మకాలను నిషేధిస్తూ హంగర్గాలో తీర్మానం చేశారు. ఈ మేరకు సర్పంచ్ ఆధ్వర్యంలో పాలకవర్గం గ్రామంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా సర్పంచ్ ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ.. ఎవరైనా గ్రామంలో ఐస్‌క్రీమ్‌లు, నాణ్యతలేని చిప్స్, జంక్‌ఫుడ్స్ అమ్మితే రూ.5వేలు జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. కలుషితమైన రంగునీళ్లతో తయారు చేసే క్యాండీలు, ఐస్‌క్రీమ్‌ల కారణంగా పిల్లలు అనారోగ్యానికి గురవుతు న్నారన్నారు. అనంతరం వేసవిలో ప్రజలు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, గోపీ, పంచాయతీ కార్యదర్శి గంగారం, గోవింద్, బజరంగ్, జీవన్, ఈశ్వర్, ప్రకాష్, తరుణ్, శంకర్, మన్సూర్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత మెగా ఆరోగ్య శిబిరం

**అక్షరటుడే, మాక్లూర్:** మండలంలోని మెట్టుపల్లి గ్రామంలో గురువారం ఉచిత మెగా ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. రోటరీ క్లబ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని సర్పంచ్ బీరెల్లి పద్మ ప్రారంభించారు. ఎముకలు, నరాల వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమున్న వారికి ఉచితంగా మందులు అందించారు. అనంతరం సర్పంచ్ పద్మ మాట్లాడుతూ గ్రామం బాగుంటేనే దేశం బాగుంటుందనే సూక్తిని తాను బలంగా నమ్ముతానని స్పష్టం చేశారు. అందులో భాగంగానే గ్రామభివృద్ధికి, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తాను నిరంతరం కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఉచితంగా ఆరోగ్య సేవలు అందించిన వైద్యులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు శ్యామ్ సుందర్ అగర్వాల్, కార్యదర్శి గోవింద్ జవహర్, ప్రముఖ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డిలో అధునాతన రోబోటిక్, ఎండోయూరాలజీ సేవలు ప్రారంభం




**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి లో అధునాతన రోబోటిక్, ఎండోయూరాలజీ సేవలు ప్రారంభించడం జరిగిందని సోమాజిగూడ యశోద ఆస్పత్రి యూరాలజిస్ట్ గోపిచంద్ తెలిపారు. గురువారం ఆయన కామారెడ్డి యశోద బ్రాంచ్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రత్యేక ఆరోగ్య సేవలను మెరుగుపరిచే దిశగా యశోద హాస్పిటల్స్ సోమాజిగూడ కీలక అడుగు వేసిందన్నారు. కామారెడ్డి, పరిసర జిల్లాల ప్రజల కోసం అత్యాధునిక ప్రెసిషన్ రోబోటిక్, ఎండోయూరాలజీ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. గ్రామీణ, సెమీఅర్బన్ తెలంగాణలో పెరుగుతున్న కిడ్నీ, మూత్రపిండ, ప్రొస్టేట్ వ్యాధులకు మెరుగైన చికిత్స అందించడమే లక్ష్యంగా ఈ సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. రోబోటిక్ సిస్టమ్‌తో చికిత్స అందిస్తామని ఆయన వెల్లడించారు. ప్రొస్టేట్ క్యాన్సర్, కిడ్నీ క్యాన్సర్, మూత్రాశయ క్యాన్సర్‌లకు ఈ పద్ధతి ఉపయోగపడుతుందని చెప్పారు. యశోద సోమాజిగూడ యూరాలజీ విభాగం సర్జికల్ సర్వరీ పద్ధతుల ద్వారా తక్కువ నొప్పి, వేగవంతమైన కోలుకోవడంపై దృష్టి పెడుతోందన్నారు. ఈ సమావేశంలో సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.

## యథావిధిగా బస్సుల రాకపోకలు.. సమ్మెలో సొమ్మసిల్లిపోయిన కార్మికుడు

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి లో ఆర్టీసీ సమ్మె కొనసాగుతోంది. మొదటి రోజు ప్రయాణికులు ఇబ్బంది పడ్డా మధ్యాహ్నం తర్వాత ఒక్కొక్కటిగా బస్సులు రోడ్డెక్కేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. మొదటి రోజు జరిగిన ఘటనల నేపథ్యంలో అధికారులు, పోలీసులు గురువారం పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. సమ్మె చేస్తున్న కార్మికులను బస్టాండ్ లోపలికి రానివ్వలేదు. ఎంట్రెన్స్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సమ్మెను శాంతియుతంగా నిర్వహించుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బుధవారం విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిపై దాడికి పాల్పడిన కండక్టర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి కార్మికులకు హెచ్చరిక జారీ చేసినట్లుగా ప్రచారం సాగుతోంది. దాంతో గురువారం కార్మికులు పోలీసులు చెప్పినట్లుగా బస్టాండ్ బయట, రోడ్డుకు అవతల వైపు సమ్మె చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు, జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. జిల్లాలో గురువారం ఉదయం నుంచి హైర్ బస్సులు, కొన్ని ప్రభుత్వ బస్సుల్లో ప్రైవేట్ డ్రైవర్లను ఏర్పాటు చేసి ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. బుధవారం కండక్టర్ లేకుండానే కదిలిన బస్సులు గురువారం కండక్టర్లతో బయలుదేరాయి.




కామారెడ్డి డిపో నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ బస్సులు కలిపి సుమారు 50 నుంచి 60 బస్సులు బయలుదేరడంతో ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణికులు వెళ్లడానికి నిరాకరించారు. ప్రైవేట్ బస్సులలో అధిక ఛార్జీలు పెట్టుకుని వెళ్లడం కంటే వేచిచూసి ఆర్టీసీ బస్సులోనే వెళ్లడానికి ఆసక్తి చూపించారు. దీంతో ప్రైవేట్ బస్సులు ఖాళీగా దర్శనమిచ్చాయి. మరోవైపు కొత్త బస్టాండ్ ముందు సమ్మె చేపట్టిన ఆర్టీసీ కార్మికుల్లో కామారెడ్డి బస్ డిపోలో పనిచేస్తున్న రమేశ్ తీవ్ర అస్వస్థకు గురయ్యాడు. ఎండ వేడిమికి తట్టుకోలేక సొమ్మసిల్లి పడిపోయాడు. దాంతో తోటి కార్మికులు, పోలీసులు వెంటనే స్పందించి చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు.

## రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం :** రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో గురువారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని హమాలవాడికి చెందిన అనిల్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. అతడు ఓ అమ్మాయిని ప్రేమించగా.. ఈ విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మూడో టౌన్‌లో కౌన్సిలింగ్ సైతం నిర్వహించారు. అయితే అమ్మాయి తనకు దక్కదనే మనస్థాపంతో అనిల్ కరీంనగర్ డెమో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న రైల్వే ఎస్ హెచ్ ఓ సాయి రెడ్డి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.